
# ఆమె వయస్సెంత?



— ఎ. బాలరెడ్డి

అందమైన గ్రేకలర్ హోండాకారు జూబ్లీహిల్స్ రోడ్డుపై అరవై కిలోమీటర్ల వేగంతో పరిగెడుతోంది. ఉదయభానుడి వెలుగురేఖలు పల్చపల్చగా పరుచుకుంటున్నాయి. శీతాకాలమవ్వడంతో తొమ్మిదిగంటలు దాటినా 'చలి' మనిషిని వణికిస్తోంది.

ఎగుడు దిగుడుగా ఉండే జూబ్లీహిల్స్ రోడ్డుపై హోండాకారు డ్రైవ్ చేస్తోన్న డ్రైవర్ చేతులు స్టీరింగ్‌ను గట్టిగా పట్టుకున్నా చలి వల్ల పట్టుసడలుతోంది. కారుకి ఎదురుగా రోడ్డు మధ్యన పరిగెత్తుకువస్తోన్న మనిషిని చూసి డ్రైవర్ కుడికాలు బ్రేకుమీద పడింది. స్పీడోమీటర్‌లో కారువేగం ఇరవైకి పడిపోయింది. కారుకి, రోడ్డుమీద మనిషికీ మధ్య దూరం తగ్గుతోంది. పోనుపోను కారునడక 'జీరో' దగ్గర నిలిచింది. రోడ్డుపై కారు ఆగింది. ఎదురుగా పరుగెత్తుకు వస్తోన్న ఆగంతకుడు కారు ముందుకొచ్చి ఆగాడు. అతనికి—కారుకి మధ్య గేప్ రెండు గజాలు మాత్రమే. అతనూ, కారూ తప్ప పరిసరాల్లో మరొకరెవరూ లేరు. కారుకి అడ్డంగా నిల్చొన్న అతడెవడో డ్రైవర్‌కి తెలియదు.

నిమిషంసేపు నిశ్శబ్దం.

అతనిచూపు కారు డ్రైవర్ మీద పడలేదు. డ్రైవర్ మాత్రం అతన్నే చూస్తున్నాడు.

'కారెందుకు ఆపావు? వెనక సీట్లో రిలాక్స్‌గా కూర్చొని కళ్ళు మూసుకొని 'కల'గంటున్న యజమానురాలు కళ్ళు తెరుస్తూ డ్రైవర్‌ను ప్రశ్నించింది.

అందమైన కల ఎగిరిపోయిందనే అసంతృప్తి ఆమె మనసులో చోటు చేసుకుంది.

''మేడమ్... అతడెవడో...!''

వెంటనే ఆమె దృష్టి కారు అద్దం లోంచి ఎదురుగ్గా ఉన్న 'అతడి'మీదకి మళ్ళి సర్రున వెనక్కి తిరిగొచ్చింది.

''బయట వేరెవరైనా అతన్ని చూస్తున్నారా?''

'లేదు మేడమ్... ఇక్కడ మనిద్దరం



# వయసుకు ప్రేమా? ప్రేమకు వయసా మనసా?

మాత్రమే'

''అయితే.. అతన్ని కారులోకొచ్చి కూర్చోమను''

కారు డోరు తెరుచుకుంది. ఫ్రంట్ సీట్లో డ్రైవర్ పక్కనే కూర్చొన్నాడతను.

''షూటింగ్‌కి టైమవుతుంది స్టార్ట్ చేయ్''

ఆమె పలుకులో గంభీరతను అర్థం చేసుకున్న డ్రైవర్ కారు స్టార్ట్‌చేసి, గేరు మార్చి కుడికాలుతో ఎక్సిలేటర్ తొక్కాడు. స్పీడో మీటర్‌లో కారువేగం పెరుగుతోంది. కారు లోపల సన్నగా వినిపించే ఇంజను సవ్వడి మినహా మరే శబ్దంలేదు.

''ఇలా ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు కనిపించి నా మనసుపొరల్లో దాగిన జ్ఞాపకాలను ఎందుకు తిరగదోడ్తావ్. ఆనాడు నువ్వడిగిన ప్రశ్నకి నేను సమాధానం చెప్పలేదనే కోపంతో అప్పటిదాకా మన మధ్య సాగిన ప్రేమకి ఫుల్‌స్టాప్ పెట్టి వెళ్ళిపోయావ్. నువ్వు మళ్ళీ కనిపించవనీ, కనిపించినా నీతో మాట్లాడకూడదని నాకు నేనే జవాబు చెప్పుకున్నా! ఇప్పుడు నువ్విలా నాకారుకి అడ్డంగా నిల్చోవడం వేరెవరైనా చూస్తే నా గ్లామరు నా ఇమేజ్ ఏమవుతుందోఆలోచించావా! నా ప్రతిష్టనెందుకిలా దిగజార్చాలనుకుంటున్నావ్ విజయ్. నేను నీకేం అన్యాయం చేశానని''

డ్రైవర్ పక్కన కూర్చొన్న అతను ఆమె మాటలకి వెనక్కి తిరిగి చూశాడు. డ్రైవర్ చూపు మాత్రం రోడ్డుమీదే ఉంది.

ఆమె కళ్ళల్లో కనిపిస్తోన్న మనసులోని ఆవేదన 'వేడి' అతని హృదయాన్ని తాకలేకపోయింది.

''నువ్వు గ్లామరస్ హీరోయిన్‌వి మాత్రమే కాదు. ఉత్తమనటిగా జాతీయ అవార్డు సంపాదించుకోగలిగిన బెస్ట్ ఆర్టిస్టువని కూడా నాకు తెలుసు! కెమేరాముందు నువ్వు చెప్పే ప్రతి డైలాగు నిర్మాతకి కనకవర్షం కురిపించవచ్చు. కానీ నువ్విపుడీ కారులో చెప్పిన అందమైన పలుకులు అబద్ధాలని నీకూ నాకూ తెలుసు! నిజం చెబితే నీ సొమ్మేం పోతుందని? అబద్ధాలు చెప్పి బతకడం నీ గ్లామరు ఫీల్డులో గొప్ప అవ్వచ్చేమో కానీ, నిజాయితీగా నీకు మనసిచ్చిన మనిషితో ఇప్పటికీ నిజం చెప్పాలనుకోకపోవడం నీలోని ఆత్మవంచనకి బలమైన నిదర్శనం వాణీ!'' అతని 'వాడి' మాటలకు ఆమె తలదించుకుంది. కారు వేగం కంటిన్యూ అవుతూనే ఉంది.

''ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్?''

''ఇప్పటికైనా నిజం చెప్పమంటాను?'' కసిగా అన్నాడు విజయ్.

''అందువల్ల నీకేమైనా ఉపయోగముందా?'' వాణి ఎదురు ప్రశ్న వేసింది.

''అంటే.. నువ్వేది చేసినా ఎదుటివాళ్ళ ఉపయోగం కోసమే చేస్తుంటావా. నీ కంటూ ఒక 'ఆత్మ'లేదా! దాన్ని చంపుకొని ఇలా బ్రతకడం నీకు సిగ్గుగా లేదూ. సంవత్సరం తర్వాత మళ్ళీ మనిద్దరం కలిశాం. అప్పటికీ– ఇప్పటికీ నీ స్టేటస్ అదే! అరవై డెబ్బైమంది ముందు కెమేరా ఎదురుగ్గా నిల్చొని ఎంతోమంది హీరోలతో ప్రేమకబుర్లు చెప్పావ్. డ్యూయెట్లు పాడావ్! అయినా నీకు సిగ్గులేదు. డబ్బు పుచ్చుకుని చేసిన 'ప్రేమ వ్యవహారం' కాబట్టి అది 'నటన' మాత్రమేనని నీకునువ్వే సమాధానపడ్డావ్. అలాంటి 'ప్రేమ' సన్నివేశాల్లో నటించి నటించి ఆడపిల్లకి ఉండే సహజమైన సిగ్గును కోల్పోయావ్. 'ప్రేమ' అనే పదానికి అసలు నీకు అర్థం తెలుసా! తెలియకుండానే ప్రేమ కథా చిత్రాల్లో గొప్పగా నటించేసి ప్రేక్షకులను పిచ్చివాళ్ళను చేసి నెంబర్‌వన్ హీరోయిన్‌గా నీ ఇమేజ్‌ను పెంచుకొని 'డబ్బు' చేసుకుంటున్నావ్. అలానే ఉండక నాకెందుకు మాయమాటలు చెప్పావ్ ప్రేమిస్తున్నానంటూ'' ఆవేశంతో అడిగాడు విజయ్.

ఒక నవ్వు నవ్వింది వాణి. ఆ నవ్వుకి ఆమె పెదవులకున్న లిప్‌స్టిక్ మరింత ఎరుపెక్కినట్టు కనిపించింది.

కారు స్టూడియోకి దగ్గరవుతోంది.

వాణి పెదవి విప్పడంలేదు. ఆమె జవాబుకోసం విజయ్ ఎదురు చూస్తున్నాడు.

రెండు నిమిషాల తర్వాత–

''నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావ్. కెమేరా వెనక నేను సాగించిన ప్రేమకి ఏ మగాడు దొరక్క నీవెంటపడలేదు. నా మనసుకి నువ్వు నచ్చావ్-కనుకే నీతో ప్రేమని పెంచుకుని పంచుకోవాలనుకున్నాను. నీ మంచితనం , నీ నిజాయితీ నన్ను ఆకట్టుకుంది. నాకున్న అంతస్థు, పేరు నీకు లేవు. అయినప్పటికీ నిన్నెందుకు ప్రేమించానో నీకు తెలుసు. కలిసి కబుర్లు చెప్పుకున్నాం 'ప్రేమ'లోని తియ్యదనాన్ని అందుకోవాలనే తపనతో ఆఖరి అంచుదాకా చేరుకున్నాం. అయితే మన ప్రేమని మధ్యలోనే తుంచేసింది

## ఇది నా తొలి రచన

*జర్నలిస్టుగానే పాఠకులకు పరిచయమైన నేను 'కథ'లు రాయాలని ఎన్నడూ అనుకోలేదు. అయితే నేనీ కథ రాయాలనే ఆలోచనను నాలో రేకెత్తించింది మాత్రం 'ఉదయం' నవతరం వారపత్రిక మాగజైన్ ఎడిటర్ శ్రీ పాలకోడేటి.*

*సుప్రసిద్ధ నవలా రచయిత శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌ను ఐదేళ్ళ క్రితం ఓ పత్రికకు నేను ఇంటర్వ్యూ చేస్తున్నప్పుడు ఆయన చెప్పిన మాట నాకిప్పటికీ గుర్తుఉంది.*

*''కథలు, నాటకాలు మాత్రమే రాస్తున్న నన్ను 'నవల' రాయమని అభిమానంతో నాకు మొదటిసారిగా చెప్పిన రచయిత పాలకోడేటిగారు. ఆయన అలా అనడంతో నవలా రచనకి శ్రీకారం చుట్టాను'' అని శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ ఆనాడు నాకిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇవాళ శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ నవలా రచయితగా ఎంతటి సంచలనాన్ని సృష్టించారనేది మనందరికీ తెలిసిందే.*

*శ్రీ పాలకోడేటి నన్ను కథ రాయమన్నవుడు 'నేను రాయలేనని'చెప్పలేకపోయాను. ఈ కథ మీకు నచ్చితే ఆ క్రెడిట్ పాలకోడేటిగారిది. నచ్చకపోతే మీకు మంచి కథ ఇవ్వలేని అసమర్థత నాదిగా భావిస్తున్నాను.*

*శ్రీ పాలకోడేటికి కృతజ్ఞతలతో–*

*–ఎ.బాలరెడ్డి*

*ఫిల్మ్ ఎడిటర్, శివరంజని*

'నేను'కాదని నీకు తెలుసు. నా జీవితానికి సంబంధించి నువ్వడిగిన ప్రశ్నలకి, నా మనసులో ఏదీ దాచుకోకుండా అంతా చెప్పేశాను. కానీ ఒకే ఒక్క ప్రశ్నకి నేను జవాబు చెప్పలేదనే కోపంతో పెంచుకున్న ప్రేమ మొక్కను కసాయి వాడిలాతుంచేసి వెళ్ళిన నువ్వు మళ్ళీ ఎందుకు కనిపించావ్? ఎంతో కష్టపడి నటించిన సినిమా ఒక్కోసారి 'ఫ్లాప్' అవుతుంది. ఆ సినిమా పోయిందని బాధపడుతూ కూర్చుంటే ఫలితం శూన్యం. అలాగే మన ప్రేమ కూడా ఒక 'ఫ్లాప్ సినిమా' అనుకుని మర్చిపోయాను. మళ్ళీ ఇలా నువ్వు మన 'ప్రేమ'ను గుర్తు చేయడం ఫ్లాప్ సినిమాకి అవార్డు వచ్చినట్టుగా ఉంది'' అంది వాణి.

''అంతేకానీ ఆ ప్రశ్నకి ఇప్పటికీ సమాధానం చెప్పనంటావ్''

''చెబితే నన్ను నువ్వు పెళ్ళి చేసుకుంటావా?''

''ఆ అనుమానం ఎందుకొచ్చింది''

''నీ పద్ధతి చూస్తుంటే నీ ప్రశ్నకి జవాబు చెప్పే ముందు నేనొక ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్పు. నువ్వు నా వయస్సును ప్రేమించావా? నన్ను ప్రేమించావా?'' అడిగింది వాణి.

తడుముకున్నాడు విజయ్.

''నిజమైన ప్రేమికుడికి 'నిజం' చెప్పడం అవసరమే. నా వయసు గురించి నువ్వడిగిన ప్రశ్నకి నేను జవాబు చెప్పలేదనే వంకతో వెళ్ళిపోయావ్. మళ్ళీ వచ్చి అదే ప్రశ్న అడుగుతున్నావ్. అంత మాత్రాన నువ్వు స్వచ్ఛమైన ప్రేమికుడివి కాదనను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావంటే నా వయసు నీకనవసరం. లేదూ నా వయసును ప్రేమిస్తున్నావంటే నీతో నాకనవసరం. సినిమా తారల ప్రేమ ఫలించదని అనుకునేవాళ్ళ నమ్మకం మరోసారి బలపడుతుంది మన ప్రేమ విఫలమైతే'' చెప్పింది వాణి.

ఆలోచనలో పడ్డాడు విజయ్.

స్టూడియో గేటు ముందు ఆగింది కారు. సెక్యూరిటీ గార్డు గేటు తెరుస్తున్నాడు.

విజయ్ తన సీట్లోంచి వెనక వైపుకి వంగి వాణి కుడి చెయ్యిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. సున్నితమైన ఆమె చెయ్యిపై ఓ అందమైన 'ముద్దు' ముద్ర వేశాడు. విజయ్ కళ్ళల్లోంచి రాలిన ప్రేమానందబాష్పాలు ఆమె చెయ్యిపై పడ్డాయి. మనసు సంతోషంతో సంబరపడింది.

కారు స్టూడియో లోపలికి ప్రవేశించబోతోంది.

'డ్రైవర్ ఒక్క నిమిషం కారాపు' విజయ్ మాటతో కారుకి బ్రేక్ పడింది.

''వాణీ.. నేను ప్రేమిస్తుంది నీ వయస్సుని కాదు, నిన్నేనని నీకు తెలుసు. కానీ నీ ప్రేమికుడిగానీ వయస్సెంతో అడిగే హక్కు నాకు లేదనే నీ వనుకుంటే, నీ వయస్సెంతో నాకు చెప్పడం వల్ల నీ సినిమా గ్లామరు తగ్గిపోతుందని నువ్వు భావిస్తే చెప్పకు. మగాడి ఆదాయం, ఆడదాని వయస్సు అడగకూడదంటారు. అది తెలిసి కూడా నీ వయస్సెంత అని అడిగాను. దాచిపెట్టుకుంటే దాగేది కాదు వయస్సు. మన ప్రేమని వయస్సుతో ముడిపెట్టడంలేదు. కాకపోతే నా మనసులో మొలకెత్తిన సందేహాన్ని నీ ముందుంచాను. చెప్పడం, చెప్పకపోవడమనేది నీ ఇష్టం. నేనిక్కడే దిగిపోతాను. షూటింగ్ అయిపోయాక నువ్వు తిరిగొచ్చేదాకా ఇక్కడే ఉంటాను'' కారు దిగుతూ చెప్పాడు విజయ్.

క్షణంలో కారు స్పీడ్ అందుకుంది. షూటింగ్ స్పాట్‌కి చేరుకుంది. వాణి డైరెక్టర్‌ను విష్ చేసి, అసిస్టెంట్ డైరెక్టర్ చెప్పిన డైలాగును నెమరువేసుకుంటూ కెమేరా ముందు నిల్చొంది. షాట్‌లోకి హీరో కూడా వచ్చి జాయిన్ అయ్యాడు.

* * *

షూటింగ్‌కి డైరెక్టర్ పేకప్ చెప్పగానే వాణి కారు దగ్గరికి వచ్చింది. డ్రైవర్ డోర్ తీశాడు. క్షణం పాటు ఆగింది వాణి.

'నువ్వు యూనిట్ కారులో ఇంటికెళ్ళు' డ్రైవర్‌తో చెప్పింది వాణి.

తను డ్రైవర్ సీట్లో కూర్చొని కారుని ముందుకు పోనిచ్చింది.

స్టూడియో గేటు దగ్గర కారాపింది. ఆమె కోసం అక్కడే ఎదురు చూస్తోన్న విజయ్‌ను లోపలికి ఆహ్వానించింది కారు డోర్ తెరుస్తూ.

ఫ్రంట్ సీట్లో వాణి పక్కనే కూర్చొన్నాడు విజయ్. కారు వేగంగా సాగిపోతుంది.

వాణి విజయ్ మనసుల్లో మరే ఆలోచనల్లేవు ఒకే ఒక్కటి తప్ప తమ 'ప్రేమ'ను మూడు ముళ్ళ శుభముహూర్తంతో అందరికీ చెప్పేది ఎప్పుడా అని!

వాణి ఎడమ చెయ్యి, విజయ్ కుడి చెయ్యి కలయికలో జనిస్తోన్న వెచ్చదనం సాయంత్రం హైదరాబాద్ చలిని తరిమికొడుతోంది.

బంజారా హిల్స్ రోడ్డుపై కారు హుషారుగా పరిగెడుతోంది వాణి - విజయ్‌ల ఆనందానుభూతిని పంచుకుంటూ.

